# ఒప్పందాలు (నిబంధనలు)

ఇద్దరు వ్యక్తుల మధ్య లేక సమస్థాయికి చెందిన ఇరుపక్షాల మధ్య (కొన్నిసార్లు వేరు వేరు స్థాయిలకు చెందిన వారి మధ్య) ఒప్పందాలు దౌత్యాలు సంధిరాయబారాలు జరిగినట్లు బైబిల్లో పలుచోట్ల ప్రస్థావనలు వున్నాయి. సంబంధ బాంధవ్యాలను పటిష్టం చేసుకోడానికి పలుమార్లు ఈ ఒప్పందాలు వుపకరించాయి. హెబ్రీ భాషలో ఒప్పందాన్ని కరారు చేసుకొడాన్ని 'ఖండించడం' అంటారు. బహుశా, ఈ పదం ఒప్పందం జరిగే సమయంలో ఒప్పందానికి గుర్తుగా ఒక జంతువును రెండు భాగాలుగా నరికి ఇరుపక్షాలవారు ఆ జంతు ఖండాల మధ్య నడిచిపోయే ఆచారాన్ని సూచిస్తుండవచ్చు. అంటే ఇరుపక్షాలవారు ఆ ఒప్పందానికి బద్దులై వుంటామని తీర్మానించుకున్నారని అర్థం (ఆది 15:7-21: యిర్మియా 34:18-19). అది 21:22-34లో అబ్రాహాం అబీమెలెకులు బెయేర్షెబా దగ్గరవున్న బావి అబ్రాహాంకు చెందుతుందని ఒప్పందం చేసుకున్నారు. సొలొమోను హీరాముల మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో ఉభయులకు ప్రయోజనకరమైన వర్తక సంబంధాలు కూడ చోటు చేసుకున్నాయి (1 రాజులు 5:1-12) స్త్రీ పురుషుల మధ్య జరిగే వివాహం దేవుడే సాక్షిగా వున్న ఒప్పందం (మలాకీ 2:14).

ఒప్పందాలను కరారు చేసికొనే సమయంలో ఒప్పందాలకు రుజువులుగా (లేక, సాక్ష్యంగా) కొన్ని ఆచారాలను పాటించేవారు. ఉదా: విందు చేసికోవడం (ఆది 26:26-31): కానుకలివ్వడం (1 సమూ 18:3,4): రాతిని గాని రాళ్ళకుప్పనుగాని పేర్చడం (ఆది 31:43-55): చెప్పు నివ్వడం (రూతు 4:7,8). ఇవేమీ కాకపోతే, చేతిలో చెయ్యి వేయడం (2 రాజులు 10:15). ఒప్పందాల ముఖ్యోద్దేశం ఇరుపక్షాల్లో ఒకరిపట్ల ఒకరికి విధేయతను విశ్వాస్యతను కలగజేయడం, ఒప్పందాన్ని భంగపరచడాన్ని తీవ్రమైన విషయంగా పరిగణించేవారు.

ఈ విధమైన ఆలోచనా ధోరణి ఆదినుంచి ఇశ్రాయేలు విశ్వాస జీవితాన్ని నిర్దేశించింది. అన్నిటికన్నా ముఖ్యమైన ఒప్పందాలు దేవుడు తన ప్రజలతో చేసిన ఒప్పందాలు. వీటిలో కొన్ని: దేవుడు నోవహుతో (ఆది 6:18). అబ్రాహాంతో (12:1-7: 15:4-21: 17:1-16). ఫీనెహాసుతో (సంఖ్యా 25:10-15). యెహోషువ నేతృత్వంలోని ఇశ్రాయేలు గోత్రాలతో (యెహోషువ 24:25) చేసినవి. దావీదు వంశం నిత్యం పరిపాలించే వంశమని దేవుడు వాగ్దానం చేశాడు (2 సమూ 7:12-16:2 దిన 13:5:1 రాజులు 8:22-26: 2 దిన 6:12-15 కూడ చూడండి). క్రైస్తవులు యేసులో నెరవేరిందని నమ్మే ఇశ్రాయేలు నిరీక్షణకు (అంటే మెస్సీయా కొరకు వారి నిరీక్షణ) ఈ వాగ్దానమే మూలం.

అతి ప్రాముఖ్యమైన ఒడంబడిక సీనాయి కొండపై జరిగింది. ఇశ్రాయేలీయులు తన ప్రజలని, వారు తనను తగినరీతిలో ఆరాధించడానికి తన దృష్టికి అంగీకారమైనట్లుగా వారు జీవించడానికి అవసరమైన ఆజ్ఞలను కట్టడలను దేవుడు ఈ కొండపై యిచ్చాడు. తమ వంతుగా ఇశ్రాయేలీయులు యెహోవా ఆజ్ఞలకు కట్టడలకు లోబడి ఆయనను మాత్రమే ఆరాధించాలి. మోషే ఒక బలిపీఠాన్ని నిర్మించి ఆ బలిపీఠం మీద, ప్రజల మీద రక్తాన్ని ప్రోక్షించి ఈ ఒడంబడికను ముద్రించాడు (నిర్గమ 24). ఇశ్రాయేలు చరిత్ర వారి భివవ్యం ఈ ఒడంబడిక మీద ఆధారపడి వున్నాయి. ఇశ్రాయేలీయులు ఈ ఒడంబడికకు బద్దులై నమ్మకస్థులై జీవించినట్లయితే, గత నిబంధనల్లో దేవుడు వారికి వాగ్ధానం చేసిన దీవెనలన్నింటిని వారు పొందుతారు. అయితే, వారు దేవుని ధర్మశాస్త్రానికి అవిధేయులై ఇతర దేవుళ్ళను పూజించినట్లయితే వారు శిక్ష ననుభివిస్తారు (ద్వితీ 4:1,2,39,40: 7:12-15: 8:19-20).

మనుషుల హృదయాలపై మనస్సులపై యెహోవా రాసిన క్రొత్త నిబంధన గురించి యిర్మీయా ప్రవక్త ప్రవచనపూర్వకముగా సెలవిచ్చాడు. (యిర్మీయా 31:31-37) చివరి రాత్రి భోజనమప్పుడు యేసు పలికిన మాటలు ఈ ప్రవచనాన్ని నెరవేర్చాయని క్రైస్తవుల నమ్మకం (మత్తయి 26:28). హెబ్రీ 10:16 చూడండి.